క్లుప్తంగా

రేపు విద్యుత్ సరఫరాకు అంతరాయం

పెదగంట్యాడ: గాంధీనగర్ 11కేవీ ఫీడర్, వినాయకనగర్ 11కేవీ ఫీడర్ పరిధిలోని పలు ప్రాంతాల్లో ఈ నెల 5న విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నామని ఏపీఈపీడీసీఎల్ జోన్–2 ఈఈ బీకే నాయుడు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. వినాయకనగర్ ఫీడర్ పరిధిలోని వుడా కాలనీ, ప్రధాన రహదారి, వినాయకనగర్, గొంతినవానిపాలెం, వేంకటేశ్వరస్వామి ఆలయం వెనుక, గాంధీనగర్ ఫీడర్ పరిధిలోని సమతానగర్, చిన నడుపూరు, పెదనడుపూరు, వెంపళ్లనగర్, శీకువానిపాలెం, సిద్ధేశ్వరం తదితర ప్రాంతాల్లో శుక్రవారం ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకూ విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని పేర్కొన్నారు.

రూరల్ పరిధిలో..

11కేవీ బీసీఎల్ ఫీడర్ మరమ్మతుల నేపథ్యంలో గిరిజా కాలనీ, దయాల్‌నగర్, సంజీవకాలనీ, టీఎన్నార్ ఫంక్షన్ హాల్, భవానినగర్ ప్రాంతాల్లో శుక్రవారం ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని తెలియజేశారు.

ఉచిత నేత్ర వైద్య శిబిరానికి స్పందన

అగనంపూడి: జీవీఎంసీ 85వ వార్డు అగనంపూడి నిర్వాసిత కాలనీలో శ్రీసత్యసాయి క్లినికల్ విజన్ కేర్, నేత్ర ఆర్గనైజేషన్ సంయుక్తంగా నిర్వహించిన ఉచిత నేత్ర వైద్య శిబిరానికి స్పందన లభించింది. కార్యక్రమంలో సెక్టార్–1 పరిసర కాలనీల నుంచి 85మందికి కంటి పరీక్షలు చేసి, వారిలో 9 మందికి శస్త్ర చికిత్సలు అవసరమని వైద్యులు గుర్తించారు. ఈ సందర్భంగా విజన్ కేర్ వైద్యుడు కె.శివకుమార్ మాట్లాడుతూ అవసరమైన వారికి ఆపరేషన్ చేయించి ఉచితంగా కళ్లద్దాలు అందిస్తామన్నారు. కార్యక్రమంలో లయన్స్‌క్లబ్ ప్రతినిధి కిడిమి హనుమంతురావు, నిర్వాహకులు డాక్టర్ వి.వి.రామారావు, కె.జె.నాయుడు, బలిరెడ్డి సత్యనారాయణ, ఎం.జగదీష్ తదితరులు పాల్గొన్నారు.

సచివాలయాన్ని సందర్శించిన ఏడీసీ



సచివాలయంలో ఏడీసీ విశ్వనాథన్

అక్కిరెడ్డిపాలెం: జీవీఎంసీ 68వ వార్డు చిన్నఅక్కిరెడ్డిపాలెం సచివాలయాన్ని జీవీఎంసీ అడిషనల్ కమిషనర్ విశ్వనాథన్ బుధవారం సందర్శించారు. సచివాలయ పరిధిలో పింఛన్లు ఎన్ని ఉన్నాయి, పంపిణీకి ఎంత నగదు అందింది, పింఛన్ల పంపిణీకి తీసుకుంటున్న జాగ్రత్తలపై అడ్మిన్ రేఖ, వెల్ఫేర్ సెక్రటరీ సత్యనారాయణను అడిగి తెలుసుకున్నారు. ఏడీసీ వెంట గాజువాక జెడ్సీ సన్యాసి నాయుడు, ఏపీడీ ఎల్.రాము ఉన్నారు.

ఓటు హక్కును విధిగా వినియోగించుకోవాలి

పెదగంట్యాడ: ఓటు హక్కును ప్రతి ఒక్కరూ విధిగా వినియోగించుకోవాలని సిస్టమేటిక్ ఓటర్స్ ఎడ్యుకేషన్ అండ్ ఎలక్టోరల్ పార్టిసిపేషన్ (స్వీప్) టీమ్ హెడ్, మండల విద్యాశాఖాధికారి శ్రీనివాస్ కోరారు. గాజువాక నియోజకవర్గం పరిధిలోని గంగవరం గ్రామంలో గల 289వ పోలింగ్‌స్టేషన్‌కు సంబంధించి ఓటర్లతో బుధవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ఓటర్లకు అవగాహన లేక ఈ పోలింగ్ కేంద్రంలో ఓటింగ్ శాతం తక్కువగా ఉంటోందని చెప్పారు. ఈ ఎన్నికల్లో పోలింగ్ శాతాన్ని పెంచేలా కృషి చేయాలని బీఎల్‌వోలకు సూచించారు.

నేడు మరిడిమాంబ పండగ

ఉక్కునగరం: స్థానిక సెక్టార్–5 ట్రై వీక్లీ మార్కెట్ దరి మరిడిమాంబ అమ్మవారి ఉత్సవం గురువారం నిర్వహించనున్నారు. వేకువజామున ప్రత్యేక పూజలతో ఉత్సవం ప్రారంభమవుతుంది. అనంతరం లలితా సహస్రనామ పారాయణ, మరిడిమాంబ భజన మండలి వారి భజన ఏర్పాటు చేశారు. మధ్యాహ్నం అన్నసమారాధన ఏర్పాటు చేశారు. అనంతరం ఉక్కునగరం వీధుల్లో అమ్మవారి ఊరేగింపు ఉంటుందని ఆలయ కమిటీ ప్రతినిధులు తెలిపారు. సాయంత్రం కూచిపూడి అకాడమీ పసుమర్తి వెంకటరమణ మూర్తి శిష్య బృందం కూచిపూడి నృత్య ప్రదర్శన ఏర్పాటు చేసినట్టు చెప్పారు.

పెన్షన్.. టెన్షన్

సచివాలయాల వద్ద పండుటాకులు, దివ్యాంగుల పడిగాపులు



సీతానగరం సచివాలయంలో పెన్షన్ల కోసం బారులు తీరిన లబ్ధిదారులు



చిన్నఅక్కిరెడ్డిపాలెం సచివాలయానికి వస్తున్న అంధురాలు అనుష్కా రాణి

గాజువాక/పెదగంట్యాడ: ప్రతి నెలా ఒకటో తేదీన ఇంటికి వచ్చి పింఛన్ ఇచ్చే వలంటీర్ ఇప్పుడు రావడం లేదు. సచివాలయ సిబ్బందైనా ఇంటికి వస్తారేమోనని ఎదురు చూసిన వృద్ధులు, దివ్యాంగులకు ఎదురుచూపులే మిగిలాయి. చంద్రబాబు కుట్రతో వలంటీర్లు రారని తెలుసుకున్న పింఛన్ లబ్ధిదారులు చేసేది లేక అతి కష్టం మీద సచివాలయాలకు చేరుకుని పింఛన్ల కోసం నిరీక్షించడం కనిపించింది. పింఛన్ డబ్బులను డ్రా చేయడానికి అడ్మిన్లు బ్యాంక్‌లకు వెళ్లిపోవడంతో వృద్ధులు, వికలాంగులు సచివాలయాల్లోనే గంటల తరబడి అవస్థలు పడాల్సి వచ్చింది. సచివాలయాల వద్ద జనం ఎక్కువగా ఉండడంతో ఇబ్బందులు ఎదుర్కొన్నారు. మళ్లీ పాత ప్రభుత్వం మాదిరిగా తయారైందని, పెన్షన్ డబ్బులు తీసుకోవడానికి ఎన్ని కష్టాలు పడాలో అంటూ వారంతా నిట్టూర్చారు.

72వ వార్డులో..

- 72వ వార్డు ఎస్సీ కాలనీ సచివాలయంలో సాయంత్రం ఏడు గంటల సమయంలో పింఛన్లు పంపిణీ చేశారు. దీంతో వృద్ధులు, దివ్యాంగులు రోజంతా నిరీక్షించాల్సి వచ్చింది.



డాక్‌యార్డ్ కాలనీ సచివాలయంలో క్యూలో నిలబడి పింఛన్ తీసుకుంటున్న లబ్ధిదారులు



చినఅక్కిరెడ్డిపాలెం సచివాలయంలో పింఛన్లు అందజేస్తున్న సచివాలయ సిబ్బంది

పింఛన్‌కు పాట్లు

అక్కిరెడ్డిపాలెం: బుధవారం మధ్యాహ్నం 3.30 గంటల నుంచి 68వ వార్డు చిన్న అక్కిరెడ్డిపాలెం సచివాలయంలో పింఛన్లు పంపిణీ చేశారు. వృద్ధులు, దివ్యాంగులు, అంధులు పింఛన్లు తీసుకునేందుకు రావడానికి ఇబ్బంది పడ్డారు. ఎండ కూడా ఎక్కువగా ఉండటంతో రాకపోకలకు అవస్థలు ఎదుర్కొన్నారు.

87వ వార్డులో..

కూర్మన్నపాలెం 87వ వార్డులో వడ్లపూడి రామాలయం సచివాలయంలో బుధవారం రాత్రి 7 గంటల నుంచి పింఛన్ల పంపిణీ ప్రారంభమైంది. దీంతో ఉదయం నుంచి లబ్ధిదారులు నిరీక్షించాల్సి వచ్చింది. గురువారం నుంచి ఉదయం నుంచి రాత్రి వరకు పింఛన్లు పంపిణీ చేస్తామని సచివాలయ సిబ్బంది తెలిపారు.

86వ వార్డులో..

86వ వార్డు డాక్‌యార్డ్ కాలనీ సచివాలయంలో పింఛన్లు పంపిణీ చేశారు. ప్రతి నెలా వలంటీర్ ఇంటికి తెచ్చి పింఛన్ ఇచ్చేవారని, దానిని నిలిపివేయడంతో మళ్లీ తమకు కష్టాలు ప్రారంభమయ్యాయని వృద్ధులు నిట్టూర్చారు. ఐదేళ్ల తర్వాత ఆఫీసులకు వచ్చి క్యూల్లో నిలబడి పింఛన్లు తీసుకోవాల్సి వస్తుందని కొందరు లబ్ధిదారులు అసహనం వ్యక్తం చేశారు.



నీలాపువీధి సచివాలయంలో పెన్షన్ల కోసం నిరీక్షిస్తున్న లబ్ధిదారులు



పెన్షన్ తీసుకునేందుకు లబ్ధిదారును సచివాలయానికి తీసుకువస్తున్న కుటుంబ సభ్యులు



దుర్గవానిపాలెం సచివాలయంలో పెన్షన్లు తీసుకుంటున్న లబ్ధిదారులు



వడ్లపూడి రామాలయం సచివాలయంలో పింఛన్లు తీసుకుంటున్న లబ్ధిదారులు

ఇంటికి వచ్చి ఇస్తేనే బాగుండేది



గతంలో ప్రతి నెలా 1వ తేదీన ఉదయాన్నే వలంటీర్ ఇంటికి వచ్చి పెన్షన్ ఇచ్చేవారు. దీని వల్ల మాకు ఎటువంటి ఇబ్బందులు ఉండేవి కావు. కానీ ఈ నెల సచివాలయానికి రావడం కష్టమైంది. ఇక్కడ కూడా సమయానికి ఇవ్వకుండా వేచి ఉంచారు. ఉదయం నుంచి పడిగాపులు కాశాం. సాయంత్రం వరకు ఉంచి ఇప్పుడు పెన్షన్ ఇచ్చారు. ఇంటికి తెచ్చి ఇస్తే మాలాంటి వారికి ఊరట.

– గంట్యాడ అప్పలనర్సమ్మ, సీతానగరం

రోజంతా ఇక్కడే ఉన్నాను



పెన్షన్ కోసం రోజంతా ఇక్కడే ఉన్నాను. ఉదయం నుంచి తిండీ తిప్పలు లేకుండా పడి ఉన్నాను. అసలు ఈ రోజు పెన్షన్ ఇస్తారో లేదో తెలియలేదు. గతంలో ఇంటికి తెచ్చి మరీ డబ్బులు ఇచ్చేవారు. చంద్రబాబు తీరు కారణంగా మాకు ఈ ఇబ్బందులు వచ్చాయి. వచ్చే నెల నుంచైనా పింఛన్లు ఇంటికి తీసుకువచ్చి ఇచ్చేలా చూడాలి.

– కాకినాడ నూకాలమ్మ, దుర్గవానిపాలెం

నేను పక్కా లోకల్

- మా తాత అప్పన్న, తండ్రి గురునాథరావు ఇక్కడి నుంచే పోటీ చేసి గెలిచారు
- ఇక్కడే పుట్టి పెరిగాను
- ఈ ప్రాంతంపై పూర్తి అవగాహన ఉంది
- అవకాశం ఇస్తే గాజువాకను మరింత అభివృద్ధి చేస్తాను
- వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి గుడివాడ అమర్‌నాథ్



73వ వార్డు సమావేశానికి హాజరైన కార్యకర్తలు



అమర్‌నాథ్, నాగిరెడ్డిని గజమాలతో సత్కరిస్తున్న కార్పొరేటర్ భూపతిరాజు సుజాత, శ్రీనివాసరాజు

గాజువాక: 'నేను గాజువాక వాసినే.. ఇక్కడే పుట్టి, గాజువాక వాసులతో కలిసి మెలిసి పెరిగాను. మా తాతయ్య గుడివాడ అప్పన్న, తండ్రి గురునాథరావు ఇక్కడి నుంచే పోటీ చేసి ఎమ్మెల్యేలుగా విజయం సాధించారు. నేను ఇక్కడి నుంచి అనకాపల్లి వెళ్లాను తప్ప, అనకాపల్లి నుంచి ఇక్కడికి రాలేదు. ఈ ప్రాంతంపై పూర్తి అవగాహనతో ఉన్న వ్యక్తిని.. ఎన్నికల్లో గెలిపిస్తే గాజువాకను మరింత అభివృద్ధి పథంలో నిలుపుతాను' అని రాష్ట్ర మంత్రి, వైఎస్సార్‌సీపీ గాజువాక ఎమ్మెల్యే అభ్యర్థి గుడివాడ అమర్‌నాథ్ అన్నారు. 73వ వార్డు కార్పొరేటర్ భూపతిరాజు సుజాత ఆధ్వర్యంలో బుధవారం నిర్వహించిన వార్డు వైఎస్సార్‌సీపీ కార్యకర్తల ఆత్మీయ సమావేశంలో ఆయన మాట్లాడారు. 'నేను మీ కుటుంబ సభ్యుడిని, ఎన్నికల్లో నాకు ఓటేసి గెలిపించే బాధ్యత మీదే'నని పేర్కొన్నారు.

99 శాతం హామీల అమలు

ఇచ్చిన మాట ప్రకారం 99 శాతం హామీలను నెరవేర్చిన ముఖ్యమంత్రి జగన్ మోహన్‌రెడ్డి అని అమర్ పేర్కొన్నారు. అధికారంలోకి రాగానే డ్వాక్రా మహిళలకు రుణమాఫీ చేసి, వారికి పునర్జన్మనిచ్చారని, గ్రూపులు కొనసాగే విధంగా చర్యలు తీసుకున్నారని అన్నారు. అందుకే ఈ ఎన్నికల్లో జగన్ మోహన్ రెడ్డిని మళ్లీ ముఖ్యమంత్రిగా చేసుకోవడానికి వారంతా సిద్ధంగా ఉన్నారన్నారు.

పాత రోజులను గుర్తు తెస్తున్నారు

రాష్ట్రంలో వలంటీర్ వ్యవస్థ ద్వారా లబ్ధిదారులకు పింఛన్ అందకుండా చంద్రబాబు కుట్ర చేస్తున్నారని అమర్‌నాథ్ ఆవేదన వ్యక్తం చేశారు. పాత రోజులను గుర్తుకు తెస్తూ వృద్ధులను రోడ్డున పడేశారన్నారు. ముఖ్యమంత్రి జగన్ మోహన్‌రెడ్డి గడిచిన ఐదేళ్ల కాలంలో క్రమం తప్పకుండా వలంటీర్ వ్యవస్థ ద్వారా పింఛన్లను ఇళ్లకే అందిస్తే, చంద్రబాబు ఆ వ్యవస్థను చిన్నాభిన్నం చేశారని అన్నారు. వలంటీర్ల వల్ల ఉపయోగం లేదని చెబుతున్న చంద్రబాబు ఆయన అధికారంలోకి వస్తే ఈ వ్యవస్థను రద్దు చేయడానికి కూడా వెనుకాడరని అన్నారు.

మరింత అభివృద్ధికి ప్రణాళికలు సిద్ధం : ఎమ్మెల్యే

గాజువాకను ఇప్పటికే అభివృద్ధి చేశామని ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డి చెప్పారు. నియోజకవర్గాన్ని మరింత అభివృద్ధి చేసేందుకు ప్రణాళికలను సిద్ధం చేశామన్నారు. గతంలో ఎన్నడూలేని విధంగా 25వేల కుటుంబాలకు ఇళ్లు మంజూరు చేశామన్నారు. ఇది పేదల ప్రభుత్వమని, గాంధీజీ కలలుగన్న గ్రామ స్వరాజ్యాన్ని తీసుకొచ్చిన ముఖ్యమంత్రి జగన్ మోహన్‌రెడ్డిని మళ్లీ గెలిపించుకోవాలని కోరారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి భూపతిరాజు శ్రీనివాసరాజు, నాయకులు పల్లా చినతల్లి, రాజాన వెంకటరావు, కులుకూరు మంగరాజు, మొల్లి చిన్న, ఎస్.ఎం.డి.గౌస్, షౌకత్ ఆలీ, ఆళ్ల శివ గణేష్, యువశ్రీ, గొందేశి రమణారెడ్డి, కంది పైడినాయుడు, కరణం వేణుగోపాల్, వి.రామకృష్ణరాజు, గొరుసు సత్యం రెడ్డి, బొట్ట సత్తిబాబు, ప్రభ, కె.వరలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

రూ.2 వేల కోట్లతో అభివృద్ధి, సంక్షేమం

జగన్ మోహన్‌రెడ్డి మళ్లీ ముఖ్యమంత్రి కావాల్సిన అవసరం ఎంతైనా ఉందని అమర్‌నాథ్ అన్నారు. ఆయన అధికారంలోకి వస్తేనే సంక్షేమం, అభివృద్ధి కార్యక్రమాలు కొనసాగుతాయన్నారు. గాజువాకలో అపరిష్కృతంగా ఉన్న అనేక సమస్యలకు ముఖ్యమంత్రి జగన్ మోహన్ రెడ్డి నాయకత్వంలో ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డి శాశ్వత పరిష్కారం చూపించారన్నారు. నియోజకవర్గంలో దాదాపు రూ.2000 కోట్లతో అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను చేపట్టారన్నారు. ఈ నియోజకవర్గంలో గతంలో ఎప్పుడూ ఇంత పెద్ద ఎత్తున అభివృద్ధి జరగలేదన్నారు. గాజువాకలోని పలు కాలనీలలో మౌలిక సదుపాయాలను కల్పించి నాగిరెడ్డి ప్రజలకు ఎంతో మేలు చేశారన్నారు. తన తండ్రి గురునాథరావు ఈ ప్రాంతానికి ఎమ్మెల్యేగా పని చేసినప్పుడు కొండవాలు ప్రాంతాల అభివృద్ధికి చర్యలు తీసుకున్నారన్నారు. ఆయన వారసుడిగా, మీ కుటుంబాల్లో ఒక సభ్యునిగా తనను ఆదరించి ఈ ఎన్నికల్లో ఫ్యాన్ గుర్తుకు ఓటు వేయాలని, తనను, ఎంపీగా పోటీ చేస్తున్న బొత్స ఝాన్సీలక్ష్మిని గెలిపించాలని కోరారు.

శాస్త్రోక్తంగా వైకుంఠ వేంకటేశ్వర స్వామి విగ్రహ ప్రతిష్ట



విగ్రహ ప్రతిష్టలో పాల్గొన్న గుడివాడ అమర్‌నాథ్ తదితరులు

పెదగంట్యాడ: జీవీఎంసీ 65వ వార్డు వాంబే కాలనీలో కలియుగదైవం వైకుంఠ వేంకటేశ్వరస్వామి ఆలయంలో స్వామి విగ్రహ ప్రతిష్ఠను బుధవారం శాస్త్రోక్తంగా నిర్వహించారు. ఉత్తరాంధ్ర సాధు పరిషత్ అధ్యక్షుడు శ్రీనివాసానంద సరస్వతి స్వామి, కాండూరి వెంకట రమణాచార్యులు ప్రత్యేక పూజలు చేసి విగ్రహ ప్రతిష్ఠాపన చేశారు. స్వామి వారిని ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డి, వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి గుడివాడ అమర్‌నాథ్, మాజీ ఎమ్మెల్యే చింతలపూడి వెంకట్రామయ్య దర్శించుకున్నారు. కార్యక్రమంలో కార్పొరేటర్లు బొడ్డు నర్సింహపాత్రుడు, మహ్మద్ ఇమ్రాన్, రాజాన రామారావు, విగ్రహ దాతలు పెంటకోట వెంకట నాగేశ్వరరావు, అప్పలరెడ్డి, శంకరరావు తదితరులు పాల్గొన్నారు.

కలిసికట్టుగా పని చేద్దాం

లంకెలపాలెం నాయకులతో పెందుర్తి ఎమ్మెల్యే అదీప్‌రాజ్



ఆత్మీయ సమావేశంలో నాయకులతో అదీప్‌రాజ్

అగనంపూడి: ప్రజారంజక పాలన అందిస్తున్న వైఎస్సార్‌సీపీ అధినేత జగన్ మోహన్‌రెడ్డిని మళ్లీ ముఖ్యమంత్రిని చేయడం కోసం పార్టీలోని కార్యకర్త నుంచి నాయకుల వరకు కలిసికట్టుగా పని చేయాలని పెందుర్తి ఎమ్మెల్యే అన్నంరెడ్డి అదీప్‌రాజ్ కోరారు. 85వ వార్డు లంకెలపాలెంలోని శ్రీరామ్‌నగర్ కాలనీలోని బీసీ నాయకుడు నెల్లి కన్నబాబు స్వగృహంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. పార్టీ విజయానికి సహకారం అందించాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు సుందరపు అప్పారావు, యలమర్తి వెంకటరావు, కర్రి నరసింగరావు, కాతా సూరేష్, సిమ్మ సునీల్, గొల్లవిల్లి శ్రీను, కొటాన రాము, మోపాడ అప్పారావు, వడ్డాది అప్పలరాజు, ఎడ్ల నాయుడు, కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

అమర్‌నాథ్‌ను ఆశీర్వదించండి

- తన గెలుపు బాధ్యత మీదే..
- గ్రామపెద్దలను కోరిన మంత్రి మాతృమూర్తి గుడివాడ నాగమణి



గొంతిన నూకరాజు తదితరులతో మాట్లాడుతున్న మంత్రి అమర్‌నాథ్ తల్లి గుడివాడ నాగమణి

అక్కిరెడ్డిపాలెం: వైఎస్సార్‌సీపీ గాజువాక ఎమ్మెల్యే అభ్యర్థి గుడివాడ అమర్‌నాథ్‌ను ఆశీర్వదించి, అత్యధిక మెజార్టీతో గెలిపించాలని ఆయన మాతృమూర్తి గుడివాడ నాగమణి గ్రామపెద్దలను కోరారు. అమర్ గెలుపు బాధ్యత మీపై ఉందన్నారు. 68వ వార్డు చిన అక్కిరెడ్డిపాలెంలోని గ్రామ పెద్దలను కలిసిన ఆమె అమర్‌నాథ్ విజయానికి సహకరించాలని కోరారు. గ్రామ పెద్ద గొంతిన నూకరాజు నివాసంలో ఆయనను, వారి కుటుంబ సభ్యులను కలిశారు. ఈ సందర్భంగా మాజీ మంత్రి, దివంగత గుడివాడ గురునాథరావుతో వారికున్న అనుబంధాన్ని గుర్తు చేసుకున్నారు. గాజువాక వాస్తవ్యులుగా తమను గుండెల్లో పెట్టుకున్న అక్కిరెడ్డిపాలెం గ్రామాన్ని తాము ఎప్పటికీ మరిచిపోలేమన్నారు. అమర్‌నాథ్ గెలుపు గాజువాకకు నూతన ఉత్తేజాన్నిస్తుందన్నారు. ఎంపీ అభ్యర్థి బొత్స ఝాన్సీని కూడా గెలిపించుకుని ముఖ్యమంత్రి జగన్‌మోహన్ రెడ్డికి కానుకగా ఇద్దామన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ వార్డు ఇన్‌చార్జి గుడివాడ లతీష్, పార్టీ సీనియర్ నాయకులు ఈటి శ్యామలరావు, ఈటి శ్రీరాములు, సంగ్రాన నూకరాజు, వరదాడ వెంకటరమణ, నేలపాటి సత్యవతి, సయ్యద్ హుస్సేన్, సతీష్, శీరం జగదీష్, నేలపాటి శ్యాంబాబుతో పాటు పలువురు వైఎస్సార్‌సీపీ అభిమానులు పాల్గొన్నారు.

చంద్రబాబు అబద్ధాలను నమ్మొద్దు

- కూటమికి ఓటు వేస్తే స్టీల్‌ప్లాంట్‌ను అమ్మేయడానికి మద్దతు ఇచ్చినట్లే..
- వైఎస్సార్‌సీపీ గాజువాక ఎమ్మెల్యే అభ్యర్థి గుడివాడ అమర్‌నాథ్
- 66, 88 వార్డుల్లో విస్తృత ప్రచారం



రైతు బజార్‌లో మహిళ నుంచి సమస్యలు తెలుసుకుంటున్న అమర్‌నాథ్



66వ వార్డులో కరపత్రం అందించి ఓటు అభ్యర్థిస్తున్న అమర్‌నాథ్



66వ వార్డులో ప్రచారం చేస్తున్న వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి అమర్‌నాథ్



హారతులతో స్వాగతం పలుకుతున్న మహిళలు



గజమాలతో సత్కరిస్తున్న కాలనీవాసులు

గాజువాక: ఎన్నికల వేళ చంద్రబాబు చెప్పే అబద్ధాలను ఎవరూ నమ్మొద్దని రాష్ట్ర మంత్రి, వైఎస్సార్‌సీపీ గాజువాక ఎమ్మెల్యే అభ్యర్థి గుడివాడ అమర్‌నాథ్ కోరారు. ఆయన అధికారంలోకి వస్తే పేదలకు సంక్షేమ పథకాలు అందవని పేర్కొన్నారు. 66వ వార్డులోని కైలాసనగర్, కణితి రోడ్, నవాబ్‌నగర్‌లలో బుధవారం విస్తృత ప్రచారం నిర్వహించారు. కార్పొరేటర్ ఇమ్రాన్‌తో కలిసి ఇంటింటికీ వెళ్లి ఎన్నికల కరపత్రం అందజేసి తనకు ఓటు వేయాల్సిందిగా కోరారు. చిరు దుకాణాలలో వ్యాపారులను, కూరగాయలు అమ్మేవారిని కలిసి ఓటు అభ్యర్థించారు. ముస్లింలు, ఆటో డ్రైవర్లు అమర్‌నాథ్‌ను సత్కరించారు. అనంతరం అమర్‌నాథ్ మాట్లాడుతూ పేదలకు మంచి జరగాలంటే జగన్ మోహన్‌రెడ్డి మళ్లీ అధికారంలోకి రావాలన్నారు. టీడీపీకి ఓటు వేస్తే స్టీల్ ప్లాంట్‌ను అమ్మేయడానికి మద్దతు ఇచ్చినట్టే అవుతుందన్నారు. అందువల్ల ప్రజలు ఆలోచించి ఓటు వేయాలని కోరారు. కార్పొరేటర్లు బొడ్డు నర్సింహపాత్రుడు, రాజాన రామారావు, నాయకులు రెడ్డి జగన్నాథం, ఎస్ఎండీ గౌస్, షౌకత్ అలీ, పెదిరెడ్ల ఈశ్వరరావు, ఉరుకూటి అప్పారావు, ఉమ, ఖాజా, అలీజాన్ హజరత్ తదితరులు పాల్గొన్నారు.

పార్టీ విజయానికి ఉమ్మడిగా పని చేద్దాం



జేఎన్ఎన్‌యూఆర్ఎం కాలనీలో ప్రచారం చేస్తున్న అమర్‌నాథ్

అగనంపూడి: ఉమ్మడిగా పనిచేసి వైఎస్సార్‌సీపీ జెండాను గాజువాక నియోజకవర్గంలో మళ్లీ ఎగరవేద్దామని వైఎస్సార్‌సీపీ గాజువాక ఎమ్మెల్యే అభ్యర్థి గుడివాడ అమర్‌నాథ్ అన్నారు. 88వ వార్డు ఇన్‌చార్జి గంధ్రెడ్డి కనక మహాలక్ష్మినాయుడు ఆధ్వర్యంలో వార్డులోని మంగళపాలెం జేఎన్ఎన్‌యూఆర్ఎం కాలనీలో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ముందుగా అంబేడ్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఆయన మాట్లాడుతూ గత ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను నెరవేర్చి, మళ్లీ ఎన్నికలకు వెళ్తున్న సత్తా ఉన్న నాయకుడు ముఖ్యమంత్రి జగన్ అన్నారు. స్థానిక సమస్యలు తెలిసిన వ్యక్తిగా తనకు అవకాశం ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు. మండల జేసీఎస్ అధ్యక్షుడు వాడపల్లి రామచంద్రరాజు, మండల కన్వీనర్ బొడ్డ గోవింద్, వార్డు అధ్యక్షుడు దాడి నూకరాజు, మాజీ కార్పొరేటర్ చొప్పా నాగరాజు, నాయకులు నమ్మి ప్రసాద్, మడక నరసింగరావు, వరదరాజు, శ్యామ్, సత్యనారాయణ, శంకర్ తదితరులు పాల్గొన్నారు.

పోరాటాలతోనే 'ఉక్కు' పరిరక్షణ

కూర్మన్నపాలెం: ఎందరికో ఉపాధినిస్తున్న విశాఖ ఉక్కును కాపాడుకునేందుకు ఎంతటి పోరాటానికైనా వెనుకాడబోమని ఉక్కు పరిరక్షణ, పోరాట కమిటీ నాయకులు పేర్కొన్నారు. స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా కూర్మన్నపాలెం కూడలి వద్ద చేపట్టిన రిలే నిరాహార దీక్షలు బుధవారం నాటికి 1147వ రోజుకు చేరుకున్నాయి. దీక్షల్లో సంస్థకు చెందిన పలు విభాగాల కార్మికులు, ఉక్కు నిర్వాసితులు పాల్గొన్నారు. పోరాట కమిటీ నాయకులు మాట్లాడుతూ కార్మికుల సంక్షేమాన్ని దృష్టిలో పెట్టుకుని కేంద్రప్రభుత్వం పునరాలోచించాలని కోరారు. కార్యక్రమంలో పోరాట కమిటీ నాయకులు, ఇతర కార్మికులు పాల్గొన్నారు.

'రేషన్ డీలర్ల సమస్యలు మేనిఫెస్టోలో చేర్చాలి'

అక్కిరెడ్డిపాలెం: రేషన్ డిపో డీలర్ల సమస్యలను రాజకీయ పార్టీలు తమ మేనిఫెస్టోలో పొందుపరచాలని రాష్ట్ర రేషన్ డీలర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు దివి లీలా మాధవరావు అన్నారు. ఆటోనగర్‌లో బుధవారం నిర్వహించిన విశాఖ జిల్లా డీలర్స్ అసోసియేషన్ సమావేశంలో ఆయన రేషన్ డిపో డీలర్స్ సమస్యలపై మాట్లాడారు. కార్యక్రమంలో అసోసియేషన్ రాష్ట్ర కోశాధికారి ఆర్.గంగాధర్ గౌడ్, విశాఖ డీలర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు బాబూరావు తదితరులు పాల్గొన్నారు.